ఓల్డ్‌బోయిన్‌పల్లి ప్రజలు ఆశీర్వదించారంటే

బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం

- కలిసొచ్చిన ఓల్డ్‌బోయిన్‌పల్లి నుంచే ప్రచారం షురూ చేశాం
- ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కార్యకర్తలకు మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: తాను ఏ పని చేసినా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచే మొదలు పెట్టడం ఆనవాయితీ వస్తోందని... ఇక్కడి ప్రజలు అభ్యర్థిని ఆశీర్వదించారంటే విజయం ఖాయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కార్యకర్తలకు ఎమ్మెల్యే కృష్ణారావు పరిచయం చేశారు. రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.

కాంగ్రెస్ అబద్ధాల హామీలతో ప్రజలను మోసం చేసింది...

◆ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు కేసీఆర్ ఇచ్చినట్లుగానే లక్షా రూపాయలు ఇస్తున్నారని తులం బంగారు ఎక్కడ పోయిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో కూడిన హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఏ ఒక్క హామీ ప్రజలకు అందకపోవడం బాధాకారమని అన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ముస్లింలకు దుస్తులు పంపిణీ చేయడం లేదన్నారు. రేషన్‌కార్డులు ఇస్తామని ఇవ్వలేకపోతున్నారని ఆరోపించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... నాలుగు నెలల క్రితం ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పుడే నీటి కటకట మొదలైందని విమర్శించారు. ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలో వాటర్ ట్యాంక్ లేని పరిస్థితిలో తాను కోట్లాది రూపాయలతో అల్వాల్‌లో ట్యాంక్ నిర్మించి నీటి ఎద్దడిని తీర్చానని గుర్తు చేశారు.

నాలుగు నెలల పాలనలో అప్పుడే నీటి కటకట...

కాంగ్రెస్ పథకాలు అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు..

◆ కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ వచ్చిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ బలపరిచిన రాగిడి లక్ష్మారెడ్డికి మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలన్నారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా ఈ పథకాలు అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అందుకే ఏది ఏమైనా మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు.

సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు



స్థానికుడిగా ఆదరించి ఆశీర్వదించండి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: స్థానికుడిగా తనను ఆదరించి ఆశీర్వదిస్తే మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజల సంక్షేమానికి పాటుపడతానని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు స్థానికేతరులని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే అభ్యర్థికి ఓటు వేస్తారా.. లేక ఎక్కడో ఉండే అభ్యర్థులకు ఓటు వేస్తారా..? అనేది ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అందుకే స్థానికుడికే ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను మాట ఇస్తే తప్పే వ్యక్తిని కాదని పేర్కొన్నారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ ప్రజలు ఆశీర్వదిస్తే తన విజయం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్, మేకల హరినాథ్, నరేందర్‌గౌడ్, సయ్యద్ ఏజాజ్, మక్కాల నర్సింగ్‌రావు, కర్రె జంగయ్య, బల్వంత్‌రెడ్డి, పిట్ల రాజు, మన్నే ఉదయ్‌యాదవ్, గడ్డం నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

దేశభక్తి, దైవభక్తిని అలవర్చుకోవాలి

లిబర్టీ: ప్రతి పౌరుడు దేశభక్తి, దైవభక్తిని అలవర్చుకోవాలని జేఏసీ చైర్మన్ ఉమాశంకర్ భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షులు కే.వీ.ఎస్.శర్మలు కోరారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని కులాలు, మతాలకు అతీతంగా ప్రతివ్యక్తి పరస్పర సహకారం చేసుకుంటూ.. జీవితం సాగించాలని సూచించారు. వారు మాట్లాడుతూ బైబిల్, ఖురాన్, భగవద్గీతలో ఉన్న సారాంశం ఒక్కటేనని వారు వివరించారు. దైవభక్తి దేశభక్తి మించింది మరోకటి లేదని దైవభక్తితో జీవనం సాగిస్తే ముక్తి మార్గంలో పయనిస్తారన్నారు.

మాదిగలకు టిక్కెట్ ఇవ్వకపోవడం బాధాకరం

పంజగుట్ట: రాష్ట్రంలో అతిపెద్ద కులమైన మాదిగ సామాజిక వర్గానికి న్యాయం చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగ కులస్తులకు ఒక్క ఎంపీ టిక్కెట్ కూడా కాంగ్రెస్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎంపీ టిక్కెట్ కాంగ్రెస్ ఇవ్వకపోవడంతో మాదిగ సమాజం కాంగ్రెస్‌కు దూరమయ్యే అవకాశం ఉందని, ఉద్యమ నాయకుడిగా తనకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే టిక్కెట్ అయినా కేటాయించి మాదిగ సామాజికవర్గం కాంగ్రెస్ వెంటే ఉండేలా చేసుకోవాలని సూచించారు. గతంలో కంటోన్మెంట్‌లో పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తప్పకుండా కంటోన్మెంట్ టిక్కెట్ తనకే కేటాయిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

◆ ఈనెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని నీలి మార్చ్ నిర్వహించనున్నట్లు పిడమర్తి రవి ప్రకటించారు. బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

యూనివర్సిటీ కార్యాలయం ప్రారంభం

పంజగుట్ట: నైపుణ్యాలతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించగలరని గుజరాత్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.బీ.జడేజా అన్నారు. సోమాజిగూడలో మంగళవారం గుజరాత్‌కు చెందిన మార్వాడీ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో అత్యుత్తమ విద్య మన విద్యార్థులకు ఎంతో అవసరమని దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.

6న 'పాటపై తూటా' సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత ప్రజా గాయకుడు గద్దర్ పై కాల్పులు జరిపి 27 ఏళ్లు పూర్తయినా ఇంత వరకు నిందితులను అరెస్ట్ చేయలేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ నెల 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే పాటపై తూటా సమావేశం విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆవిష్కరించారు.

జేఎన్‌టీయూలో ఎన్నికల అధికారులకు శిక్షణ



శిక్షణ తరగతులకు హాజరైన ఎన్నికల అధికారులు

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కూకట్‌పల్లి సెగ్మెంట్‌కు చెందిన ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారు(ఏపీఓ)లకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. జేఎన్‌టీయూలోని ఐదు ప్రత్యేక ఆడిటోరియంలలో ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. భారత ఎన్నికల సంఘం మాస్టర్ ట్రైనర్లు ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముందస్తుగా పోలింగ్ రోజు, మాక్ పోల్ ఎలా నిర్వహించాలి.. మాక్‌పోల్‌ను ఎలా క్లియర్ చేయాలి.. పోలింగ్‌కు ముందు, తర్వాత ఈవీఎంలను ఎలా సీల్ చేయాలి... చట్టపరమైన కవర్‌ను ఎలా ప్యాక్ చేయాలి? అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీఓ, ఏపీఓల సందేహాలను నివృత్తి చేయడానికి ఇంటరాక్షన్ సెషన్ కూడా నిర్వహించారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



సఫ్దార్‌నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బండి రమేష్

మోతీనగర్: పార్టీ నిర్ణయాలకు కట్టుబడి కార్యకర్తలందరూ కలిసికట్టుగా పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ సూచించారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్‌లో డివిజన్ మాజీ అధ్యక్షుడు సఫీవుద్దీన్ ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యకర్తలు అందరూ పార్టీని సమన్వయం చేస్తూ ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం అల్లాపూర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, శేరి సతీష్‌రెడ్డి, మొయినుద్దీన్, విఠల్‌రెడ్డి, బర్కత్ అలీ, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి

ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్



ఇఫ్తార్‌కు హాజరైన ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, బండి రమేష్ తదితరులు

మోతీనగర్: ఇఫ్తార్ విందు హిందూ, ముస్లిం ఐక్యతకు నిదర్శనమని ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ ఎస్‌డీ ఫంక్షన్‌హాల్‌లో టీపీసీసీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ వాజిద్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి అని అన్నారు. 40 రోజులు భక్తిశ్రద్ధలతో చేసే ఉపవాస దీక్షలు ఎంతో స్ఫూర్తినిస్తాయని అన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పండుగలు ఐకమత్యానికి నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, బీ–బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, బీ–బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రేష్మ, ఏ–బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, నాయకులు పొన్నాల రాజశేఖర్‌రెడ్డి, కమ్మర్, ఎస్‌కే జావిద్ అలీ, సత్యనారాయణగౌడ్, దినేష్ చౌదరి, గాలి బాలాజీ, బాబా ఫసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యంగ్ సైంటిస్ట్ అవార్డుకు డా. కే.వెంకటేశ్వరరావు ఎంపిక



కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అకాడమీ ఆఫ్ సైన్స్ మంగళవారం ప్రకటించిన యంగ్ సైంటిస్ట్ అవార్డు ఎంపికలో జేఎన్‌టీయూ నానో టెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా, రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న డా. కే. వెంకటేశ్వర్‌రావుకు 2022–23 సంవత్సరానికి ఎంపిక చేశారు. భౌతిక, గణిత శాస్త్రాలు విభాగంలో తమ ప్రొఫెసర్‌కు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ వారు ప్రకటించటం ఎంతో సంతోషకరమైన విషయమని వీసీ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. ఈ పరిశోధనల వల్ల ముందుతరాల విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. రెక్టార్ డా. కె. విజయకుమార్ రెడ్డి డాక్టర్ వెంకటేశ్వర్‌రావును అభినందనలు తెలుపుతు యువ శాస్త్రవేత్త రావడం వల్ల యూనివర్సిటీ ఆచార్య వర్గం మీద మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ అవార్డు కోసం పలు యూనివర్సిటీల్లో పని చేస్తున్న 59 మంది సైన్స్ సైంటిస్ట్‌లు పోటీ పడటం విశేషం.

ఘనంగా తూము శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలు



మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: మూసాపేటలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై శ్రావణ్‌కుమార్‌తో కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శ్రావణ్‌కుమార్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ప్రజాసేవలో ముందుకు సాగుతూ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నర్సింహాయాదవ్, సతీష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, సబిహా బేగం, శిరీష బాబూరావు, నరేంద్ర ఆచార్య, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, నపారి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, జానకీ రామరాజులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, కృష్ణ ముదిరాజ్, కిరణ్, సీహెచ్. భాస్కర్, జి.రవి, యాదగిరి, మహేష్, రాజేందర్, బాలస్వామి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేయకుండా ముగ్గులు

మూసాపేట: మూసాపేట డివిజన్ పరిధిలోని గార్బేజ్ వల్నరేబుల్ పాయింట్స్(జీవీపీ) తొలగింపు కోసం ఒక వారం ప్రణాళికలో భాగంగా జీవీపీ చెత్త వల్ల హాని కలిగించే ప్రాంతాలను మహిళ సంఘాల సమాఖ్య సభ్యులు, ఆర్‌పీలు, శానిటేషన్ సూపర్‌వైజర్లు, శానిటేషన్ వర్కర్లు, సిబ్బంది వడ్డెర బస్తీ కమిటీ హాల్ వద్ద, రాయల్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా, ఈనాడు ముందు జీవీపీ పాయింట్‌ల వద్ద, మోతీనగర్ పరిధిలో ప్రజలు చెత్త వేయకుండా వారికి అవగాహన కల్పించే విధంగా జీవీపీల తొలగింపు కోసం ముగ్గులు వేసి అలంకరించారు.



జీవీపీల తొలగింపు ప్రాంతంలో ముగ్గులు వేసిన పారిశుద్ధ్య కార్మికులు

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో మోసం

రూ.19.5 లక్షలు మోసపోయిన బాధితుడు

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వ్యక్తికి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపించారు. వారు చెప్పినట్లుగానే బాధితుడు మొదటగా కొంత పెట్టుబడి పెట్టాడు. వాటికి లాభాలు వచ్చాయని నమ్మించారు. అనంతరం మరిన్ని లాభాల కోసం వెల్త్ మేనేజ్‌మెంట్‌లో రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టమని బాధితుడికి చెప్పారు. బాధితుడికి ఏడాది పాటు వడ్డీ లేకుండా వర్చువల్ లోన్ ఇచ్చినట్లు చూపించారు. లాభాలకు ఆశపడి బాధితుడు రూ.21.7 లక్షలు డిపాజిట్ చేశాడు. అనంతరం బాధితుడు రూ.2.2 లక్షలను లాభంగా విత్‌డ్రా చేసుకున్నాడు. మరోసారి బాధితుడు రూ.7 లక్షలు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. ఆ డబ్బు విత్‌డ్రా కాకపోవడంతో బాధితుడు రూ.19, 50,000 మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తా



సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో రోడ్లు ఛిద్రమయ్యాయని, తాగునీరు రావడం లేదని, డ్రైనేజీ పొంగిపొర్లుతోందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన రాజు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.... టమాట 17, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 18, బీన్స్ 45, క్యారెట్ 19, గోబిపువ్వు 18, దొండకాయ 23, చిక్కుడుకాయ 50, గోరుచిక్కుడు 23, బీట్‌రూట్ 19, క్యాప్సికం 65, ఆలుగడ్డ 31, కీరా 23, దోసకాయ 16, సొరకాయ 9, పొట్లకాయ 18, కంద 55, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 22, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 35, ముల్లంగి 4 నుంచి 6, చిలగడ దుంప 15, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు 55 నుంచి 60, మునగకాయలు 5 నుంచి 6, పచ్చిబఠాణి 55, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 200, అల్లం 140, వెల్లుల్లి 200, చింతపండు 140, పండుమిర్చి 80, ఉసిరి 40, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

కాంగ్రెస్‌లో చేరికలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి ఆధ్వర్యంలో పలువురు మంగళవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీ కోసం పనిచేసినా తగిన గుర్తింపు లేదన్నారు. అందుకే వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో సురేఖ, భాగ్యలక్ష్మి, సరస్వతి, స్వప్న, మల్లికా, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సంతోష్‌లు ఉన్నారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, నాయకులకు న్యాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బాషిపాక నాగమణి, మూకయ్య, వెంకటస్వామి సాగర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో జగదీశ్వర్‌గౌడ్

క్రికెట్ బెట్టింగ్ హోర్డింగ్ నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్: క్రికెట్ బెట్టింగ్‌ను ప్రోత్సహించేలా హోర్డింగ్ ఏర్పాటు చేసిన నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని సిటీ సెంట్రల్‌మాల్‌కు ఐఎక్స్ బెట్.ఇన్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఈ హోర్డింగ్ బెట్టింగ్‌లను ప్రోత్సహించేలా ఉండటంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. సిటీ సెంట్రల్ మాల్ మేనేజర్ ఆసిం ముంతాజ్ సిద్దికీ, కుషీ అడ్వర్టైజింగ్ కంపెనీ సీనియర్ మేనేజర్ ఓలేటి శ్రీనివాసరావులపై ఐపీసీ సెక్షన్ 116, గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అడ్వర్టైజ్‌మెంట్ హోర్డింగ్‌ను సీజ్ చేశారు.

క్రోధి నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి, డాక్టర్ కావూరి శ్రీనివాస్

భాగ్యనగర్‌కాలనీ: కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులోని సెవెల్‌హిల్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ ఎస్. అనంత లక్ష్మి, డాక్టర్ కావూరి శ్రీనివాస్, ప్రముఖ సినీనటులు జే.ఎల్.శ్రీనివాస్ తదితరులు పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనంతలక్ష్మి కాల గమనాన్ని తెలుపుతూ ఎన్నో అంశాల సమాహారంగా పంచాంగ రూపకల్పన జరుగుతుందన్నారు. సకల శుభములతో నూతన సంవత్సరం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యపన్నుల నిపుణులు వివేకానంద్, పారిశ్రామికవేత్త గర్నెపూడి రాధాకృష్ణ మూర్తి, సత్యం స్వామి, కామాక్షి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సుధాకర్, నర్సింహారావు, శంకర్, కరుణాకర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రామచంద్రరావు, మహిళా ప్రతినిదులు భువనేశ్వరి, వెంకటరమణి, కళ్యాణి, కందాళ జయశ్రీ, పరమేశ్వరి, పద్మావతి, మియాపూర్‌సంఘం ప్రతినిదులు సోమయాజులు, పీఆర్‌కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన బండి రమేష్

కూకట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ మంగళవారం తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో కలిశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు నేతలు చర్చించారు.



కళామందిర్ ప్రాంతంలో యూజీడీ సమస్యను పరిష్కరిస్తా

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శాతవాహనకాలనీ కళామందిర్ ప్రాంతంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జానకి రామరాజు, భానుప్రసాద్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, కృష్ణ మూర్తి, వాసు పాల్గొన్నారు.



కళామందిర్ ప్రాంతంలోని డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

దివ్యాంగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగ, బధిర ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షులు కాటమోని వెంకటప్రసాద్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సొసైటీ ఫర్ ది డెఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజుకు ఈ విషయమై వినతిపత్రం అందజేశామన్నారు. రాష్ట్రంలో అన్ని శాఖల్లో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగులకు ఎలాంటి విధులు కేటాయించొద్దని భారత ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు వెలువడినా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారన్నారు. ఉద్యోగ నియామకం సమయంలో రోస్టర్ పాయింట్ 31 ద్వారా ఎంపికైన వీరిని పూర్తిగా బధిర దివ్యాంగ ఉద్యోగులకు చెందిన వారు కాబట్టి వచ్చే ఎన్నికల్లో విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు.